క్లుప్తంగా

నేడు సైబర్ నేరాలపై అవగాహన

తెనాలి: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి నెలవారీ సమావేశం ఆదివారం జరగనుంది. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయే సమావేశానికి సంఘ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహిస్తారు. 'సైబర్ నేరాలు–అవగాహన'పై తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు ప్రత్యేక ప్రసంగం చేస్తారు. సభ్యులందరూ హాజరై సైబర్ నేరాలపై అవగాహనకు రావాలని కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

కొనసాగిన శ్రీకృష్ణ దీక్షా మహోత్సవాలు



తెనాలి: త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో శ్రీశరణాగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇక్కడ జరుగుతున్న శ్రీధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణదీక్షా మహోత్సవాలు 13వ రోజైన శనివారం కొనసాగాయి. నరేంద్ర రామానుజ దాసస్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో లోకకళ్యాణార్థం విశేషంగా ఆండాళ్ వ్రతాన్ని జరిపించారు. పాశురాన్ని భక్తులకు ప్రవచించారు. శ్రీకృష్ణపూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

హిందూ మాదిగలుగా మార్చాలి

తెనాలిరూరల్: కుల ధ్రువీకరణ సర్వేలో కొలకలూరులోని హిందూ మాదిగలను క్రిస్టియన్ మాదిగలుగా చేర్చారని, సరిచేసి హిందు మాదిగగా మార్చాలని కొలకలూరు గ్రామ ఎస్సీ మాదిగాలైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మరావు మాదిగ, న్యాయవాది సుద్దపల్లి మురళీధర్, పొన్నెకంటి చక్రవర్తి, పినపాటి అనిల్ కుమార్‌లతో పాటు గ్రామస్థులు కోరారు. రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామ సచివాలయం–2 వీఆర్‌ఓలు నాగరాజు, థామస్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. పొరపాటును సరి చేసి క్రిస్టియన్ మాదిగ బదులు హిందు మాదిగగా మార్చాలని కోరారు.

నేడు విద్యార్థులకు 'కృష్ణదేవరాయ' స్కాలర్‌షిప్‌ల ప్రదానం



తెనాలి: కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, పట్టణానికి చెందిన కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 20వ మెరిట్ స్కాలర్‌షిప్‌ల ప్రదానోత్సవం జరగనుంది. తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఏర్పాటయ్యే సభలో తెనాలి డివిజనులో 2023–24 సంవత్సరంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 341 మంది పేద విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌సిప్‌లను పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ.3 లక్షలను తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా 60 మంది పేద ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించనున్నట్టు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్‌చంద్ర తెలియజేశారు. సంఘ అధ్యక్షుడు బొల్లిముంత వెంకట నారాయణ అధ్యక్షత వహించే సభలో తులసి గ్రూపు సంస్థ ఛైర్మన్ తులసి రామచంద్రప్రభు, రంగిశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు, పారిశ్రామికవేత్త డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావు, ప్రియదర్శిని విద్యాసంస్థల ఛైర్మన్ చందు రామారావు, హిమాన్వీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఎండీ అరవ రామకృష్ణ, సంఘ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి తదితరులు పాల్గొంటారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఇస్లాంపేటకు చెందిన షేక్ సుల్తాన్ గతంలో పలు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గంజాయి విక్రయిస్తుండగా వన్ టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు, సిబ్బంది నొ నిందితుడిని అదుపులోకి తీసుకుని శనివారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

వికసించిన సాహితీ వి'శారద'

నేడు తెనాలికి చెందిన సుప్రసిద్ధ రచయిత శారద శతజయంతి సందర్భంగా....



శారద

తెనాలి: తెలుగు కథకుల్లో ఒక మెరుపులా అతి స్వల్ప కాలంలోనే ఉప్పెనలా విరుచుకుని వచ్చిన శారద, ఎందరినో విభ్రాంతులను చేశాడు. ఇంగ్లిష్ రచనల అనువాద సాహిత్యం వెల్లువలా వస్తున్న రోజుల్లో ఆయన స్వతంత్ర నవల 'మంచీ చెడు' ఒక సంచలనం. శారద నవలల్ని సీరియల్‌గా ప్రచురించి, ఆయన పేరును తెలుగునాట విరివిగా ప్రాచుర్యంలోకి వచ్చేందుకు కారకులు నాటి ఆంధ్రపత్రిక సంపాదకుడు సూరంపూడి సీతారాం, ఉప సంపాదకుడు నండూరి రామమోహనరావు. 2003లో విజయవాడ సాహితీ మిత్రులు నిర్వహించిన జ్ఞాపకాల సభకు రాసిన వ్యాసంలోనే శారదకు, రష్యన్ రచయిత డాస్టోయెవ్‌స్కీతో పోలికలను రామమోహనరావు ప్రస్తావించారు. తెలుగు నవలా సాహిత్యాన్ని ఒక మలుపు తిప్పినవారిలో శారద ఒకరనీ, ఆ నవలలు తెలుగులో స్వతంత్ర నవలలు రాయడానికి యువకులను ప్రోత్సహించాయని స్పష్టంగా పేర్కొన్నారు.

బతుకుదెరువు కోసం తెనాలికి..

శారద అసలు పేరు ఎస్.నటరాజన్. పూర్తిపేరు సుబ్రహ్మణ్యయ్యరు నటరాజన్. తెలుగు సాహిత్యంలో కొత్త వెలుగులు కురిపించిన తమిళ నటరాజన్ కవి, కథకుడు, నవలా రచయిత, నాటక రచయిత, వ్యాస రచయిత, లిఖిత పత్రికా సంపాదకుడు. 1937లో బతుకుదెరువు కోసం తండ్రితో కలిసి తెనాలి చేరాడు. హోటల్ కార్మికుడిగా తండ్రిని సాకుతూ జీవితం ఆరంభించాడు. పదిహేనేళ్ల వయసులో తండ్రి పోవటంతో క్షోభతో మూర్ఛరోగానికి గురయ్యాడు. హోటల్ వృత్తిలో ఉంటూనే తెలుగు నేర్చుకున్నాడు. నాటి తెలంగాణ పోరాటం, ఆర్థికమాంద్యం, సామాజిక సంక్షోభాలు, కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలతో శారద సాహిత్య సృజన వేయిరేకులై వికసించింది. హోటల్‌లో వంట మాస్టరుగా బజ్జీలు వేయటం, బస్టాండులో మజ్జిగ విక్రయించినా, పుస్తకాలు చదవటమో, రాయటమో చేస్తూ వచ్చాడు.

సాహిత్య జీవితం ఏడేళ్లు

భౌతిక జీవితం 30 ఏళ్లయితే సాహిత్య జీవితం ఏడేళ్లు మాత్రమే. ఆ వ్యవధిలోనే శారద కలం పేరుతో నూరుకు పైగా కథలు, ఆరేడు నవలలూ రాశారు. మంచీచెడూ, అపస్వరాలు, ఏది సత్యం, మహీపతి, సందేశం, నాగరికుని ప్రేమ, అందాలదీవి నవలలు నాటి రోజుల్లో సంచలనం. హోటల్ వర్కర్, నరబలి వంటి నాటికలు, క్షణంలో సగం పేరుతో వంద వరకు రాజకీయ చెణుకులు, అనేక గల్పికలు శారద కృషికి నిదర్శనం. సమస్త జీవితం గాయాలమయమై ఎన్నెన్నో నిరాదరణలకూ, హేళనలకూ గురవుతూ ఎన్నో ఒత్తిళ్లలోంచి, దుఃఖంలోంచి జీవిత పోరాటమే సాహిత్యంగా, సాహిత్యమే జీవితంగా పలవరించాడు శారద. తెలుగువాడు కాకున్నా అతడు తన రచనల్లో అంత గొప్పగా తెలుగుతనాన్ని పంచటం ఆశ్చర్యకరం.

రచనలతో చిరంజీవి

శారద 1955లోనే కన్నుమూసినా, ఇప్పటికీ తన రచనలతో చిరంజీవిగానే ఉండిపోయారు. తెలుగువారైన ఎందరో రచయితలు, వారి రచనలు కాలంతోపాటు కనుమరుగవుతూ వచ్చాయి. అభ్యుదయ రచయిత శారద ఇందుకు భిన్నం. నేటికీ ఆయన రచనలను కోరుకునే పాఠకులున్నారు. 'ప్రతి నిరుద్యోగిలోనూ, అన్నార్తునిలోనూ, దిగుళ్లతో సమసిపోతున్న ప్రతి రచయితలోనూ శారద జీవించే ఉన్నాడు'– శారద మిత్రుడు, జ్ఞానపీఠ్ అవార్డుగ్రహీత రావూరి భరద్వాజ అన్నట్టుగానే కాకుండా తన రచనలతోనూ శారద చిరంజీవి. 1955, 1963, 1998లో దేశీ కవితా మండలి, ఆదర్శ గ్రంథమండలి, శారద సాహిత్యవేదికలు శారద సాహిత్యాన్ని ప్రచురించాయి. ఆలూరి భుజంగరావు రచన 'సాహిత్య బాటసారి శారద' ఆయన సహచరుడి జీవితాన్ని, నాటి పరిస్థితులను కళ్లకు కట్టింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) శారద రచనలను తీసుకొచ్చింది.

> 'సాధారణంగా మేము శారద నవలను 19వ శతాబ్దపు గొప్ప రష్యన్ నవలలతో పోల్చేవాళ్లం. ముఖ్యంగా డాస్టోయెవ్‌స్కీ నవలలతో. శారద తెలుగువాడు కాదని తమిళుడని, అసలు పేరు నటరాజన్ అని, తెలుగు నేర్చుకుని రాశాడని తెలిసి అతడి మీద మా గౌరవం పెరిగింది. అతడు తెనాలిలో హోటల్ సర్వరుగా పనిచేస్తున్నాడని, కటిక పేదరికం అనుభవిస్తున్నాడని తెలిసి ఇంకా పెరిగింది. అతని నవలలు డాస్టోయెవ్‌స్కీ నవలల్లా ఉన్నాయనుకోవటమేకాక, ఆయన మాదిరి శారదకూ మూర్ఛవ్యాధి ఉందని తెలిసినప్పుడు బాధతోపాటు, ఆ పోలిక సరిగానే ఉందనిపించింది.'
>
> – నండూరి రామమోహనరావు, ప్రముఖ పత్రికా సంపాదకుడు

పుదుక్కోట్టైలో శతజయంతి

తమిళనాడు ఆర్ట్ అండ్ లిటరరీ ఫెడరేషన్, అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం, తమిళనాడు యూనిట్) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన శారద జన్మస్థలమైన పుదుక్కోట్టైలో శారద శతజయంతి ఉత్సవాలను నిర్వహిస్తోంది. తెనాలికి చెందిన ప్రముఖ రచయిత విహారి రచించిన శారద పుస్తకం తమిళ అనువాదాన్ని ఆ సభలో ఆవిష్కరిస్తారు. అరసం తమిళనాడు ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.ఆరస్, జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ సహా పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారు.



29న ఆవిష్కరించనున్న విహారి రచనకు తమిళ అనువాద పుస్తకం

ఐక్యపోరాటాలతో మతోన్మాద విధానాలు నిలువరించాలి



లోకం వెంకటేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నేతలు

శతజయంతి సభలో అరసం నేత గోలి సీతారామయ్య

తెనాలి: దేశంలో ఐక్యపోరాటాలతో ప్రజాస్వామ్య పరిరక్షణ కృషిచేయటమే లోకం వెంకటేశ్వరరావు వంటి నిబద్ధత గల కమ్యూనిస్టులకు ఇచ్చే నిజమైన నివాళిగా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ఉపాధ్యక్షుడు, 'బుద్ధభూమి' మాసపత్రిక సంపాదకుడు గోలి సీతారామయ్య అన్నారు. నిబద్ధత గల కమ్యూనిస్టు, ప్రజాకళాకారుడు లోకం వెంకటేశ్వరరావు శతజయంతి వేడుకలను శనివారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. సభకు అరసం నాయకుడు కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. గోలి సీతారామయ్య కీలకోపన్యాసం చేశారు. దేశంలో మతోన్మాద విధానాలను నిలువరించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందనీ, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకం కావాల్సిన చారిత్రక అవసరం నెలకొందన్నారు. జీవితకాలం కమ్యూనిజానికి కట్టుబడిన లోకం వెంకటేశ్వరరావు ఈ పరిణామాలను ఆనాడే ఊహించారని గుర్తుచేశారు. తొలి నుంచి సీపీఐ పార్టీకే కట్టుబడిన లోకం, చివరి దశలో డాంగే స్థాపించిన యూసీపీఐలో చేరి, పార్టీ కేంద్ర కంట్రోలు కమీషను సభ్యులుగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వ్యవహరించారని వివరించారు. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతం కావాలనే ప్రగాఢ కాంక్షను వ్యక్తంచేస్తూ, ఆ దిశగా నిరంతరం పనిచేసినట్టు వివరించారు. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వైనాలశెట్టి మూర్తి తన ప్రసంగంలో యూసీపీఐలో లోకం వెంకటేశ్వరరావు కృషిని వివరించారు. ప్రముఖ రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీ తొలి శాఖ, 1935లో తెనాలిలోనే ఏర్పాటైనట్టు చెప్పారు. కమ్యూనిస్టు ఉద్యమానికి తెనాలి ప్రాంతం పట్టుగొమ్మగా నిలిచిందనీ, అందుకు కృషిచేసిన యోధుల్లో లోకం వెంకటేశ్వరరావు ఒకరని వివరించారు. ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి గని తన ప్రసంగంలో లోకం వెంకటేశ్వరరావు దేశ సమైకత్య, సమగ్రతను కాంక్షించారనీ, కులమతాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని చెప్పారు. ప్రస్తుత సమాజం రోగంతో కొట్టుమిట్టాడుతోందనీ, స్వాతంత్ర్యం కోసం పోరాడింది గాంధీజీ, భగత్‌సింగ్ కాదంటున్నారనీ, గురు గోల్వాల్కర్ వంటి ఆర్‌ఎస్‌ఎస్ నేతల పేర్లు పుస్తకాల్లోకి ఎక్కుతున్నాయనీ వీటికి వ్యతిరేకంగా పోరాడినప్పుడే లోకం వెంకటేశ్వరరావుకు నిజమైన నివాళిగా చెప్పారు. డీఎస్ నాగేశ్వరరావు స్వాగతం పలికిన సభలో సీపీఐ నాయకుడు బొల్లిముంత కృష్ణ, సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్,డాక్టర్ వేమూరి శేషగిరిరావు, దాసరి రంగారావు, ఇందుపల్లి రాజారామ్ మాట్లాడారు. తెలంగాణ ప్రజానాట్యమండలి కార్యదర్శి పల్లె నరసింహం బృందం విప్లవ గీతాలను ఆలపించారు. సభానంతరం హైదరాబాద్‌కు చెందిన నరిశెట్టి రామారావు బృందంచే 'శ్రీకృష్ణరాయబారం' పడకసీనును ప్రదర్శించారు. తొలుత లోకం వెంకటేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. లోకం భాస్కరరావు, లోకం శ్యాంసుందరరావు, బండి సత్యవాణి, లోకం సురేష్ పర్యవేక్షించారు.

కులధృవీకరణ సర్వే ఆడిట్ పత్రాల సవరణకు వినతి



సచివాలయంలో వినతిపత్రం అందజేసిన మాదిగ సభ్యులు

కొలకలూరు(తెనాలి): గ్రామ సచివాలయాల్లో ప్రచురించిన కులధృవీకరణ సర్వే ఆడిట్ పత్రాల్లో క్రిస్టియన్–మాదిగగా నమోదుచేసిన పేర్లను హిందూ–మాదిగగా మార్చాలని కోరుతూ రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన మాదిగ, మాదిగ ఉపకులాల సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రకారం గ్రామ సచివాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్‌రంజన్ మిశ్రా ఈనెల 30న గుంటూరు వస్తున్నట్టు తెలియజేశారు. గుంటూరు కలెక్టరేట్‌లో ఆరోజు ప్రజాభిప్రాయసేకరణ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో కొలకలూరు సచివాలయాల్లో ప్రచురించిన కుల ధృవీకరణ సర్వే ఆడిట్ పత్రాల్లో కొన్ని వందలకు పైగా పేర్లు క్రిస్టియన్–మాదిగగా నమోదై ఉన్నట్టు తెలిపారు. తక్షణమే సంబంధిత సమాచారాన్ని పరిశీలించి, గ్రామంలోని మాదిగ, మాదిగ ఉపకులాల జాబితాను హిందూ–మాదిగగా సవరించి గౌరవ కమిషన్‌కు, జిల్లా కలెక్టరుకు సమర్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సుద్దపల్లి మురళీధర్, బి.హృదయరాజు, ఎమ్మార్పీయస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు, ఎస్.చిరంజీవి, ఎస్.సామేలు, ఎస్.వీరయ్య, టి.వసంతరావు, నాగరాజు తదితరులున్నారు.

శనిత్రయోదశి కదా..



స్వామికి అభిషేకం

తెనాలి: హిందూమతంలో ముఖ్యమైన రోజుల్లో ఒకటైన శని త్రయోదశి ఒకటి. ఆ పర్వదినం నేడు రావడంతో పలువురు భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం శనీశ్వరుడికి, విష్ణువుకు, ఇష్టమైన రోజు అయితే.. త్రయోదశి తిథి శివుడికి ఇష్టమైన తిథి. ఈ రెండిటి కలయికతో వచ్చే శని త్రయోదశికి విశిష్ట స్థానం ఉంది. శనివారం శనిత్రయోదశి కావడంతో పట్టణంలోని గంగానమ్మపేట పాత శివాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీ పర్వత వర్ధినీ సమేత రామేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో గల నవగ్రహాల మండపం వద్ద శనీశ్వరునికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తీసుకువచ్చిన పూజా ద్రవ్యాలతో అర్చకులు అభిషేకాలు చేశారు.

బీసీ సంఘాల అభివృద్ధికి కృషిచేసిన శేషంరాజు

ఏడో వర్ధంతి సభలో కేసన శంకరరావు



శేషంరాజు విగ్రహం వద్ద నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన సేవారత్న తంగెళ్ల శేషంరాజు బీసీ కులాలకు, రాష్ట్రవ్యాప్త భట్రాజు సంఘీయుల అభివృద్ధికి విశేషంగా కృషిచేశారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భట్రాజు సంఘీయులకు ఇళ్లస్థలాలను ఇప్పించటం, ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసహాయం చేశారని గుర్తుచేశారు. తెనాలి రామలింగేశ్వరపేట రాజుల కాలనీలోని శ్రీ సత్యసాయిబాబా మందిరంలో 'సేవారత్న' తంగెళ్ల శేషంరాజు ఏడో వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి శంకరరావు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భట్రాజు సంఘాల ఫెడరేషన్ ఏర్పాటు చేశారని చెబుతూ, గల్లీ నుండి ఢిల్లీ వరకు ఆనాటి ప్రధానులు ఇందిరా గాంధీ, పీవీ నరసింహారావులను తరచూ కలుస్తూ బీసీ సంఘాలకు కృషిచేశారని చెప్పారు. బీసీ సంఘాలకు ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు తెనాలి భట్రాజు సంఘం అధ్యక్షుడు లోలబట్టు గంగరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త భట్టరాజ సంఘీయులకు అలాగే బీసీ సంఘాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివనీ, ఆయన ఆశయ సాధన కోసం కృషిచే స్తామని చెప్పారు. ఆధ్యాత్మిక చింతనలో భాగంగా తెనాలి పట్టణ రాజుల కాలనీలో భగవాన్ శ్రీసత్య సాయిబాబా మందిరాన్ని నిర్మించారని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్త భట్రాజులందరూ ఆయనకు రుణపడి ఉన్నామన్నారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తంగెళ్ల శేషంరాజు పేద బడుగు బలహీన వర్గాలకు చేదోడు వాదోడుగా ఉండేవారని అన్నారు. కూరపాటి కొండంరాజు, భల్లం రఘునాధేశ్వరరాజు. తంగెళ్ల సత్యనారాయణరాజు, కూరపాటి సీతారామరాజు, సరికొండ సైతంరాజు, తంగేళ్ల అనురాధ, సరికొండ రమాదేవి, విజయలక్ష్మి, అన్నపూర్ణ, గిరిజాదేవి, సంఘ సభ్యులు పాల్గొన్నారు. తొలుత శేషంరాజు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



వేమూరు: పేద ప్రజలను ఆదుకునేందుకు సెయింట్ జోసఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ ముందుంటుందని కరస్పాండెంట్ లోక ఆనందకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని లూథరన్ చర్చిలో వేమూరి చెంచయ్య 6వ వర్ధంతి నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెంచయ్య అనేక విద్యా సంస్థలు స్థాపించి, పేద విద్యార్థులకు విద్యనందించారని కొనియాడారు. పేద ప్రజలను ఆదుకున్నారని గుర్తుచేశారు. ప్రతి ఏడాది చెంచయ్య వర్ధంతికి పేద ప్రజలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు జోషి, లూకా, కుటుంబ సభ్యులు వేమూరి బిల్పీ, కావ్య కౌమది పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



బైక్ ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బంది

తెనాలిరూరల్: తెనాలి పోలీస్ సబ్ డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై పట్టణ ప్రజలకు, వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి స్వయంగా హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ర్యాలీ చేపట్టారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నుండి ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని డీఎస్పీ బి. జనార్ధనరావు ప్రారంభించారు. యార్డు నుండి కొత్తవంతెన, గాంధీచౌక్, రజక చెరువు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో సీఐలు మల్లికార్జునరావు, రాములు నాయక్, రమేష్ బాబు, శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది హెల్మెట్లు ధరించి వాహనాలు నడుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అలానే హెల్మెట్ వాడకం ద్వారా అనుకోకుండా ప్రమాదం జరిగినా ప్రాణాలకు ముప్పు వాటిల్లదని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు పట్టణంలో వివిధ ఆటో మొబైల్స్ వాహన షోరూమ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

ధనుర్మాసం ముక్తి ప్రదాయిని

–ఐలవరంలో కొనసాగుతున్న నగర సంకీర్తన

ఐలవరం(భట్టిప్రోలు): ధనుర్మాసం ముక్తి ప్రదాయినని ఎస్ఎస్ఎఫ్ బాపట్ల డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు అన్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో ధనుర్మాసం నగర సంకీర్తన జరుగుతోంది. శంకరరావు మాట్లాడుతూ శ్రీ మహా విష్ణువును పూజించడం, ఈ మాసం దీక్షతో విష్ణు సంకీర్తన చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఆలయ అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ నెల రోజులూ స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో గోత్ర నామాలతో పూజలు, గోదాదేవి, రంగనాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన నిర్వాహకులు కేబీవీ రమణ, సీహెచ్ సత్యనారాయణ, జి.జగన్ మోహన్‌రావు, వి.కోటేశ్వరరావు, కె.నరసింహారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపు నుంచి నిందితుడి పరారీ

తెనాలి రూరల్: చోరీ కేసులో నిందితుడు పరారయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ముత్తెంశెట్టిపాలెం ఆంధ్రరత్న రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవన కోసం యజమాని పెద్ద మొత్తంలో వైర్లు, సామగ్రి తెప్పించి పెట్టాడు. ఇవి చోరీకి గురవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడిని రేపల్లెకు చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన వైర్లను రేపల్లెలోని దుకాణంలో విక్రయించానని చెప్పడంతో రికవరీ కోసం కానిస్టేబుళ్లు అక్కడకు శుక్రవారం తీసుకెళ్లారు. ఓ దుకాణాన్ని చూపించి అక్కడే విక్రయించానని చెప్పి లోపలికి వెళ్లి పోలీసులకు చిక్కకుండా పరారయ్యాడు. చేసేది లేక దుకాణ యజమానికి పోలీసులు తమ వెంట తీసుకువచ్చి విచారిస్తున్నట్టు సమాచారం.

డాక్టర్ వుల్లక్కి స్మారక బంగారు పతకం ప్రదానం



తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ మేజర్ కాకుమాను వుల్లక్కి స్మారక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. బోరోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ గుడారు జగదీష్‌కు బగారు పతకాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఐయంఏ అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు డాక్టర్ మధుప్రభాకర్‌బాబు, డాక్టర్ ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

తెనాలిరూరల్: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కేవీ గోపాల కృష్ణ తెలిపారు. మండలంలోని కఠెవరం గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బండికళ్ల ప్రసాద్‌తో కలసి పాల్గొన్న తహసీల్దార్ అర్జీదారులతో మాట్లాడారు. రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వే కోసం ఎనిమిది, మ్యుటేషన్ కోసం ఒకటి, వక్ఫ్ స్థలం విషయమై ఒక అర్జీ వచ్చాయి. వచ్చిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.